

శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం


వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం


శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంథ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్ని సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు


సంపుటి : 09

సంచిక : 04

**నేపథ్యం:**

**సామూహిక సాధన**

ఆశ్వయుజ పౌర్ణమి

అక్టోబర్ 7, 2025



| | |
|---|---|
| పూజ్యశ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం | First Step for Seeing Baba in ALL : గురు బోధ సారం - గురువును అంతటా, అన్నింటా, ఎప్పుడు గుర్తిస్తూ ఉండటం అని, అది అనుభవైక మార్గం చేసుకొనే మార్గం శ్రీ సార్ ఈ సత్సంగం లో తెలుపుతున్నారు. |


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

గుకారో ప్రధమో వర్ణః మాయది గుణ భాసకః గుర
రుకారోస్తి పరబ్రహ్మ మాయా భ్రాంతి విమోచకం

స్వర్ణాంచలం చిత్ర విచిత్ర శోభితం కోశేయ యుగ్మం
పరికల్పితం మాయాచాల ప్రాకృత దివ్య రూప

## విషయ సూచిక



| # | విషయం | పేజీ నెంబర్ |
|---|---|---|
| 1 | సంపాదకీయం | 4 |
| 2 | భక్తుల అనుభవాలు | 8 |
| 4 | శ్రీ సుబ్బరామయ్య సార్  లెటర్లు | 20 |
| 5 | సార్ సత్సంగం | 26 |
| 6 | మహాత్ముల వాక్యాలు | 30 |


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి






సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

# సంపాదకీయం

ఓం సాయిరాం

**గురుమధ్యేస్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః**
**గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మై శ్రీ గురవే నమః**

శ్రీగురునియందు ఈ విశాల విశ్వం ఇమిడియున్నది. ఈ విశాల విశ్వమంతా శ్రీగురుడే వున్నాడు. శ్రీగురునకు అన్యముగా ఏదియు లేదు. అట్టి గురుదేవునకు నమస్కారము.

విశాల విశ్వమంతా గురు రూపమైతే సద్గురువు మనకు అంతా శుభమే చేస్తాడు కదా! మరి కొన్ని అశుభాలు అనీ, శుభాలు అని నమ్మే జీవిస్తున్నాము. ఎందుకు కొన్ని అశుభాలు అవుతున్నాయి? అంటే మనకు ఇష్టాయిష్టాలు (రాగద్వేషాలు) ఉండటం వలన. మనకు ఇవి ఉన్నాయా లేవా అంటే ఒక పరీక్ష! ఏమిటంటే మనకు ఎవరి మీదైనా ఇష్టము (రాగము) కానీ లేదా అయిష్టము (ద్వేషం) ఉంటే మనకు ఇష్టాయిష్టాలు (రాగద్వేషాలు) ఉన్నట్లే. అది కార్యంలో (ధర్మా-ధర్మా లతో సంభంధం లేకుండా) వారిని సమర్ధించటంగా కానీ, విమర్శించటంగా కాని వ్యక్తమవుతుంది. మమకారము/రాగము/ఇష్టము కల వారికి ఏ కష్టమొచ్చినా / దుఃఖము కలిగినా మనలో అసంతృప్తి, చిరాకు వ్యక్తం అవుతుంది. ఏ విషయములోనైనా మనం అప్పుడు చేయగలిగినది ఏమి లేకున్నా, ఎదో

చేస్తే బాగుండేది అనే ఆలోచనలు (మన కర్తవాన్ని సైతం మరుగు పరిచేలా) ఉండటం  మన రాగానికి/ద్వేషానికి గుర్తు.

**"రాగమంటే అనాలోచితంగా, గుడ్డిగా మనం వస్తువుల, వ్యక్తుల సంఘటనలపట్ల ఏర్పరచుకొన్న భ్రాంతిమయమైన ప్రీతి. యోచనతో అంటే వివేకంతో దానిని తొలగించుకొని సత్యదృష్టిని, వాస్తవిక దృష్టిని అలవరచుకోవడమే వైరాగ్య (రాగం లేకపోవడం) మంటే"** అని శ్రీ భరద్వాజ మాష్టారు "శ్రీ సాయి లీలామృతం" లో చెబుతారు.  సత్య దృష్టి అంటే భగవత్ శక్తి అంతటా నిండి వస్తువులు, వ్యక్తులు, పరిస్థితులు, క్రియా కలాపాలు జరుగుతున్నాయని, మనం కూడా వాటిలో భాగమేనని తెలుసుకోవటమే! అంతేనా? అలా తెలుసుకుంటే ఏమవుతుంది, తెలుకోకపోతే ఏమవుతుంది? అంటే తెలుసుకుంటే ప్రతి క్షణం ఆనందంగా, క్రీడగా ఉంటుంది. తెలుసుకోకపోతే జీవితం ఒక బంధంగా, తక్కువ కాలం సుఖం గాను, ఎక్కువ భాగం ఏడుపుతో గడుస్తుంది. అలాగైతే ఎలా ఆ విషయం (సత్యం) తెలుసుకోవాలి?  సత్యదృష్టిని అలవరచుకోవాలి? అంటే శ్రీ భరద్వాజ మాస్టర్ చెప్పిన సులువైన సాధన పారాయణ, సత్సంగము, సామూహిక లేదా సమిష్టి ప్రార్ధనలు. సామూహిక సాధన గురించి శ్రీ మాస్టారు" శ్రీ సాయినాధ బోధామృతం" లో  చెపుతూ

**"ఇలా సాటివారితో మమత నతిక్రమించిన ప్రేమ తత్వాన్నలవరచుకోవడంలో సమిష్టి ప్రార్ధన, ధ్యానము ఎంతో ఉపకరిస్తాయి. ఒకే నిర్ణీతమైన**

**సమయంలో అందరు భక్తులూ ఒకే విధమైన ప్రార్ధన, ధ్యానము చేయడము, అవకాశమున్నంతవరకూ ఆ సమయంలో భక్తులందరూ చేరి అట్టి సాధనలను కొనసాగించడం ఎంతో ఉపకరిస్తుంది. ఇట్టి సమావేశ స్థలాలే దేవాలయాలు. పండుగలు, వివాహాలు, భజన, సద్గ్రంధ ప్రవచనము, పూజ, ధ్యానము అందరూ కలసి చేసుకొనే పాఠశాలవంటిది దేవాలయం. ధర్మ ప్రవచన విద్యాలయాలు దేవాలయాలు. ఈనాడు విస్తారంగా వృద్ధి చెందిన పట్టణాలలో అందరూ ఆలయాలలో సమావేశం అవడం తరచుగా సాధ్యపడదుగనుక ఒక భక్తుని యింట్లో ఆ ప్రాంతంలోని వారందరూ చేరి సామూహికంగా ప్రార్థనాదికాలు చేసుకోడం సాధనకెంతో దోహదం చేస్తుంది. ఒక వంక సర్వులలోనూ ఆత్మనే చూచేందుకు అది ఉపకరిస్తుంది. మరొకవంక ఆ ప్రదేశంలో దైవశక్తి జాగృతమై సాధనను పటిష్టం చేయడానికి ఉపకరిస్తుంది. అలానే భక్తులందరూ కలసి సేవా కార్యక్రమాలు చేయడం కూడా ఎంతో దోహదం చేస్తుంది. ఇందుకే శ్రీసాయి భక్తులను హారతులు చేయనిచ్చారు. శ్రీరామనవమి, ఉరుసు, గురుపూర్ణిమవంటి పండుగలు జరుపుకునేలాగ భక్తులను ప్రోత్సహించారు. తాము కూడా శిరిడీ చేరిన మొదట్లో తాకియాకు రాత్రిళ్ళు వెళ్ళి అక్కడ సాధువులతో కలసి కీర్తన చేసేవారు. చావడి ఉత్సవము వంటివి భక్తులను చేయనిచ్చారు. ఇలా తన ప్రాంతము, పట్టణములోని భక్తులతోనేగాక యితర ప్రాంతాల వారితో గూడ హృదయ సమైక్యత నందగలందులకే తీర్థక్షేత్రాలను దర్శిస్తూండడమవసరం. అట్టి యత్నానికి అచ్చట మహనీయులు చిరకాలం చేసిన తపశ్శక్తి దోహదం చేస్తుంది. అందుకే దాసనవమికి వెడతానన్న భక్తునికి సజ్జనగడ్కి వెళ్ళమని ప్రోత్సహించారు సాయి.”**

మాస్టర్ చెప్పినట్లుగా సమిష్టి ప్రార్థనలు చెయ్యాలి. దానికి సిలబస్ ఏమిటి అంటే మనకు హృదయానికి హత్తుకున్న సద్గురు చరిత్రలు, బోధలు, ఆజ్ఞలు, నిర్దేశించిన మార్గము. వాటిని ఆచరించటానికి మనమందరమూ

సత్సంగసభ్యులలో గురువును చూసే అబ్యాసం చేస్తూ, ఒకర్ని ఇంకొకరు ప్రోత్సహించుకుంటూ సత్య దృష్టిని పొందటానికి మన గురువు ఏమి చెప్పారు, ఏమి చెయ్యమన్నారు? అనే విషయాలు చర్చించుకుంటూ ఎలా చేస్తే మన సాధన ప్రీతి పూర్వకంగా చెయ్యగలుగుతామో తెలుసుకుంటూ వాటిని ఆచరించాలి. **శ్రీ సుబ్బరామయ్య సార్ అందరికీ చెప్పినవి:**

1. నిద్ర లేవగానే గురువు చేసిన మేలును, లీలలను స్మరించటం (గురు స్తుతి చెయ్యటం).
2. నాలుగు అరతులు చేయటం (ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 6గంటల 15 నిమిషాలకు, రాత్రి 9 గంటలకు). పూర్తి ఆరతి చేయలేనప్పుడు ఆ సమయాలలో లఘు ఆరతి చెయ్యటం.
3. ప్రతిరోజూ పారాయణ, పూజ, ధ్యానము చేయటం.
4. వీలయితే ప్రతిరోజూ లేదా కనీసం వారంలో ఒకరోజు సత్సంగం చెయ్యటం.
5. మనకు భగవంతుడు ప్రసాదించిన పనిని ఆయన సేవగా, గురు ప్రీతికై, గురువును top గా మెప్పించే విధం గా (కర్మ సుకౌశలం) గా చేయటం.

6. దానికి తగ్గ భావసుద్ధి - గురువే అన్ని రూపాలలో ఉండి మన సేవ సీకరిస్తున్నారు అన్న భావం తరచి తరచి వివేచిస్తూ - నిరంతరం గుర్తిస్తూ ఆ అభాసాన్ని దృడం చేసుకోవటం.
7. నెలకు ఒక్కసారి అయినా గొలగమూడి దర్శించి స్వామి సన్నిధిలో గడపటం.
8. స్వామి / సార్ సూచించిన నియమపాలనను శ్రద్ధతో ఆచరించటం
9. అన్ని రూపలలోని స్వామి వారికి సాధ్యమైనంత మన పని ద్వారా సేవ అందించటం.
10. మన ఇష్టా ఇష్టాలను పై అన్నింటి  ద్వారా గురువు పరం చేయటం.

## భక్తుల అనుభవాలు

ఓం సాయిరాం

**దమ్మపేట శ్రీ డి నాగేశ్వరరావుగారి అనుభవాలు:**

ప్రస్తుతం నా జీవితాన్ని ఈ విధంగా గడుపుతున్నాను అంటే ప్రధానమైన కారణం నాకు మాత్రం శ్రీ సుబ్బరామయ్య  సార్ మాత్రమే. ఎందుకని అంటే అంతకుముందు నా జీవితం ఎలా ఉండేది, ఇప్పుడు నా జీవితాన్ని ఎలా మలిచారు అనేది చూస్తే తెలుస్తుంది.

ఎందుకంటే ధర్మాన్ని గురించి  శ్రీ భరద్వాజ మాస్టర్ గారు చెప్పినవి అన్నీ పుస్తకాల్లో చదివి ఉన్నాము. కానీ ఆచరించడం అనేది మాత్రం శ్రీ సుబ్బరామయ్య సార్ జీవితంలో మనం కళ్ళారా చూశాం.  చాలా మంది నాతో ఈ విషయం అన్నారు.  గతంలో నేను ప్రతినెలా ఒంగోలు వెళ్లినప్పుడు రంగారావు గారు ఎక్కడనుండి వస్తున్నారు అని అడిగి శ్రీ సుబ్బరామయ్య సార్ గారి వద్ద నుండి అనగానే, "మాది వాచా శూరత్వం, శ్రీ సుబ్బరామయ్య గారిది కార్య శూరత్వం. మేము ఉపన్యాసాలు చెప్పడం రావటం అంతే, ఆచరణలో లేదు. కానీ నీవు సరైనటువంటి వాడిని పట్టుకున్నావు" అని ఎన్ని సార్లు అన్నారో లెక్కలేదు... ఎందుకంటే వాళ్లకి కూడా తెలుసు. ఎంత వరకు ఆచరిస్తున్నాం అనేది వారికి కూడా తెలుసు. మాస్టర్ గారి అనుయాయులలో ఎంత ఉంది ఆచరిస్తున్నారో నాకైతే తెలీదు కానీ, రంగా రావు గారు మాత్రం చాలా సార్లు పేరు పేరునా తలచుకునేవాళ్ళు. "ఎక్కువ మంది చెప్పేది ఒకటి, చేసేది ఇంకొకటి.  శ్రీ సుబ్బరామయ్య గారు మాత్రం శ్రీ


మాస్టర్ గారి నోటివెంట ఏది వచ్చిందో అది కంపల్సరీగా ఆచరించి చూపారు. అలాంటి బోధ మీకు అందరికీ కూడా అందజేస్తున్నారు" అని చెప్పారు. బోధ అంటే ఏదో ప్రత్యేకంగా చెప్పినట్లుగా కాకుండా శ్రీ సార్ ఏదో పని చేసుకుంటూనే క్యాసువల్ గా చెబుతారు. తర్వాత ఆలోచిస్తే దానిలో ఎంత అర్థం ఉందో తెలుస్తుంది.

వారు మహాత్ములు అనడానికి ఇంకో కారణం వారి సంకల్ప బలం. నాకు ఒకే ఒక్కసారి చెప్పారు "మహాత్ముల సన్నిధికి వచ్చి పదే పదే రీఛార్జ్ చేసుకుంటూ ఉండాలి. ప్రతి నెలా వస్తే ఎంతో మంచిది" అని చెప్పారు. వారి సంకల్ప బలం వల్ల మనం అది ఆచరించ గలుగుతాము.

ఇంకో ఉదాహరణ (avadhuta vaidyam)... అంతకుముందు నేనొక డాక్టర్ గారి దగ్గరకు వెడితే "మీకు సైనస్ ఉంది. కాబట్టి మీరు కంపల్సరీగా ఉదయం 7:00 తర్వాత నిద్ర లేస్తే మంచిది" అన్నారు. కొంచం ఆందోళనపడి వేరే ఇద్దరు ముగ్గురు డాక్టర్లను సంప్రదిస్తే వాళ్ళు కూడా అలానే చెప్పారు. మరో డాక్టర్ ఆపరేషన్ చేయించుకుంటే మంచిది అన్నారు. కానీ మా ఫ్రెండ్ ఒకతను మాత్రం "ఆపరేషన్ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయించుకు. నేను అదే బాధ పడుతున్నాను. ఆపరేషన్ వల్ల కొద్ది రోజులకు తగ్గినట్టే తగ్గి మళ్ళీ వస్తుంది" అన్నాడు. నేను శ్రీసార్ దగ్గరకు








వచ్చినప్పుడు బ్రహ్మంగారి మఠం దగ్గర ఈ విషయం చెప్పాను. దానికి శ్రీసార్ ఏ డాక్టర్ చెప్పాడు అని అడిగి " నేను చెబుతున్నాను కదా. మీరు తెల్లవారుజామునే నిద్రలేచి (తడి బట్టలతో) చన్నీటి స్నానం చేయండి" అని చెప్పారు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. నాతో పాటు వింటున్న మిగతా భక్తులు కూడా ఆశ్చర్యంతో చూశారు. శ్రీసార్ నేను చెప్పింది సరిగ్గా విన్లేదు ఏమో అనుకున్నాము. కానీ శ్రీసార్ సంకల్పబలం వలన నేను తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్రలేచి చన్నీటి స్నానం చేస్తున్నాను. ఆ డాక్టర్లు, సైనస్ జబ్బు ఎటు పోయాయో మరి. ఎప్పుడైనా మా పిల్లల దగ్గరకు వేరే ఊరు వెళ్లినప్పుడు అలా చేయలేనప్పుడు నెగెటివ్ ఎఫెక్ట్ తెలుస్తుంది. కాబట్టి తెల్లవారుజామున అలా స్నానం చేయగానే హాయిగా ఉంటోంది.

శ్రీసార్ అందరికీ "కాలము,మనసు భగవంతునికి సమర్పించమని" చెప్పేవారు. నేను ఏ రోజైనా అలా కాలం సమర్పించ లేనప్పుడు ఏమీ తినకుండా ఉండాలని నాకు నేనే సెల్ఫ్ పనిష్మెంట్ ఇచ్చుకున్నాను. ఈ విషయం సార్ కి చెబితే "చాలా మంచిపని చేశావు. దాని కోసమైనా ఉదయమే గుడికి వెళ్లి కూర్చుంటావు. అలా నీవు కాలాన్ని ఇస్తే భగవంతుడే నీ మనసు లాక్కుంటాడు" అని చెప్పారు. అలాగే నేను ఎప్పుడన్నా ఊరు

వెళ్ళినప్పుడు ఆ ఆబ్సెంట్ అయిన వాటికీ, ఊరు నుండి తిరిగి వచ్చిన తర్వాత సాయంత్రం పూట కూడా కాలాన్ని సమర్పించి బాకీ లేకుండా చూసుకుంటాను. కానీ ఒక్కసారి మా అమ్మాయికి జ్వరం తగిలిందని 18 రోజులు ముంబైలో ఉండాల్సి వచ్చినప్పుడు, తిరిగి వచ్చినాక, ఆ బాకీ చెల్లించకుండా వాయిదా వేస్తున్నాను. వెంటనే శ్రీ వెంకయ్య స్వామివారు తమ చేతిలో 18 అంకె స్వప్నంలో చూపించి హెచ్చరించారు. అలా శ్రీ సుబ్బరామయ్య సార్ చెప్పిన నియమానికి - శ్రీ వెంకయ్య స్వామివారు హెచ్చరించి ఆచరింప చేశారు. అలా వారి సంకల్పబలం ఉన్నప్పుడు ఆయా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరుగుతాయి. లేకుంటే మనం ఏమి ఆచరించలేము. మరిన్ని వివరాల కోసం ఈ **“వాళ్ళుండే దాన్ని బట్టి కదయ్యా - మనముండేది”** అనే చిన్న పుస్తకం చూడండి.


నేను హెడ్‌మాస్టర్‌గా ఉండి ప్రతినెలా ఇట్లా గొలగమూడి రావడానికి సెలవులు పెడుతున్నానని మా M.E.O. గారు కొద్దిగా హార్ష్ గా (కోపంగా) మాట్లాడారు. నేను దానికి నాకు సెలవులు ఇవ్వడం కుదరకపోతే Loss of Pay పెట్టుకుంటాను అన్నాను. నాకు ఎలిజిబిలిటీ ఉన్న లీవ్ డే (సెలవు) లు, ఎన్ని ఉన్నాయో అన్నిటికీ సెలవు పెట్టుకుంటాను. లీవ్ ఎలిజిబిలిటీ లేని మిగతా సెలవులకి “లాస్ అఫ్ పే” ఇవ్వండి అని ఒక లెటర్ రాసి ఇచ్చాను.

కొద్ది రోజుల తర్వాత నేను ప్రసాదం ఇవ్వడానికి వారి దగ్గరికి వెళ్లినప్పుడు మీరు కూర్చోండి అని నన్ను కూర్చోబెట్టుకొని "మీ గురువుగారు భలే గొప్పవారయ్యా. నీ SR (Service Register) చూస్తే నీకు 7, 8 నెలల సరిపడా లీవ్ ఎలిజిబిలిటీ ఉన్నది. నీకు ఇక Loss of Pay ఎందుకు" అన్నారు. నిజానికి అన్ని సెలవులు ఉన్నాయని నాకు కూడా తెలియదు, వారికి కూడా తెలియదు. ఇదంతా కూడా నేను లెటర్ రాసి ఇవ్వడం వల్ల తెలిసి వచ్చింది. రాసింది నేనే అయినా అలా రాయించింది మాత్రం శ్రీసార్ గారు మాత్రమే.

ఒకసారి టీచర్స్ కి ట్రాన్స్ఫర్ కోసం జిల్లాల వారీగా కౌన్సెలింగ్ జరిగింది. మా జిల్లాలో సీనియారిటీ పాయింట్స్ పరంగా నేను రెండో వాడిని. దానితో ఎక్కువ అవకాశం నాకు వచ్చింది. నాకు 5 కి.మీ. దూరంలో, 12 కి.మీ. దూరంలో, 18 కి.మీ. దూరంలో ఉన్న స్కూల్స్ లో ఏదో ఒక స్కూల్ సెలెక్ట్ చేసుకోవడానికి ఆప్షన్స్ ఉన్నాయి. మాములుగా ఎవరైనా దగ్గర్లో ఉన్న 5 కి.మీ. లోని “అచ్యుతాపురం” స్కూల్ సెలెక్ట్ చేసుకుంటారు. కానీ నేను మాత్రం స్వామివారిని, శ్రీసార్ ని తలచుకొని చీటీలు పెట్టి సన్నిహితుల ద్వారా తీయించాను. దానిలో 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న “చవ్వాపూర్” వచ్చింది. నేను ఆ స్కూల్ కావాలని అడిగితే








అక్కడ ఉన్న సెక్రటరీ గారూ మొదలైన వారందరూ ఆశ్చర్యంగా చూశారు. "మీకు దగ్గర్లో ఉన్న అచ్యుతాపురం వదులుకుని అంత దూరం వెళ్లడం దేనికి? మీరు వద్దంటే మీ తర్వాత ఇద్దరు ముగ్గురు అచ్యుతాపురం సెలెక్ట్ చేసుకోవడానికి రెడీగా ఉన్నారు. ఒక్కసారి వదులుకున్న తర్వాత మళ్ళీ అడిగినా ఇవ్వడం కుదరదు బాగా ఆలోచించుకోండి" అని రెండుసార్లు చెప్పారు. కానీ నేను మాత్రం ఆ దూరంగా ఉన్న 18 కి.మీ. లోని "చవ్వాపూర్" స్కూల్ నే ఎంచుకున్నాను. ఎంతో మంది ఎన్నో రకాలుగా నన్ను అనుకున్నారు. మా టీచర్స్ యూనియన్ వాళ్ళు కూడా నేను అచ్యుతాపురం వద్దన్నానని నన్ను సూటిపోటి మాటలన్నారు. కానీ నేను మాత్రం స్వామి ఆజ్ఞ ప్రకారం చేశానని తృప్తిగా ఉన్నాను. తర్వాత ఐదారు నెలలకే అచ్యుతాపురం స్కూల్ లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని ఆ స్కూల్ ని మూసేశారు. అక్కడ ఉన్న టీచర్స్ ని ఇంకా దూరంగా వేరే, వేరే జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. దాంతో అందరూ ఆశ్చర్యపోయారు. "ఓరినాయనో! నీవు అందుకేనా ప్రతినెలా గొలగమూడి వెళ్లేది. నీకు ఇలా జరుగుతుందని ముందే తెలుసా?" అని ఆశ్చర్యపోయారు. "నాకేమి తెలీదండి. అంతా ఆయనకు తెలుసు. నేను మాత్రం ఆయనను పూర్తిగా

నమ్మాను. పంపించినా పంపించకపోయినా ఆయన ఇష్టం. స్వామివారు చెప్పినట్లు చేయడమే నా పని" అన్నాను.

నేను రిటైర్ అయ్యేంత వరకు అదే స్కూల్‌లో పని చేశాను. అక్కడ ఏ ఇబ్బంది లేదు. అక్కడ 7 తరగతులు, 9 మంది స్టాఫ్, 36 మంది పిల్లలు మాత్రమే ఉండేవారు. దాంతో క్లాస్ లు తీసుకోడానికి టీచర్ లు పోటీపడేవారు. నేను హెడ్మాస్టర్ నైనా ఒక క్లాస్ అయినా తీసుకుందామంటే టీచర్ లు ఒప్పుకోకుండా, "మీకెందుకు సార్, మీరు హాయిగా రెస్ట్ తీసుకోండి" అనే వారు. నేను మాత్రం వారిని ఎలాగో ఒప్పించి వారానికి మూడు క్లాస్ లు తీసుకునేవాడ్ని. ఈ సెల్ ఫోన్లు వచ్చిన తర్వాత మాత్రం కొంతమంది టీచర్లు పాఠం చెప్పకుండా సెల్‌ఫోన్లు చూసేవారు. నేను వారిస్తే నన్ను ద్వేషించేవారు. కానీ నేను మాత్రం స్టాఫ్ మీటింగ్‌లో "మనం తీసుకునే జీతానికి పూర్తి న్యాయం చేయకపోయినా పర్వాలేదు. కనీసం సగంలో సగమైనా కర్తవ్య నిర్వహణ చేయాలి, చక్కగా నేర్చుకొని పిల్లలకి పాఠం చెప్పాలి" అని చెప్పేవాడిని. వారిలో ఒక టీచరు నాతో విభేదించినా, తర్వాతి కాలంలో తాము తప్పుగా మాట్లాడాము అని realize అయ్యారు, క్షమాపణ చెప్పారు. అంతే కాకుండా సరైన కర్తవ్య నిర్వహణ ద్వారా ఇప్పుడు గ్రేడ్-1 హిందీ పండిట్‌గా ప్రమోషన్ సాధించారు.

శ్రీ సార్ ఎంతటి ప్రేమమూర్తి అయినా కాలాన్ని దుర్వినియోగం చేస్తే చాలా విపరీతంగా కోపం తెచ్చుకునేవారు. సాయిమాస్టర్ నిలయానికి వచ్చి ఊరకనే కబుర్లు చెబుతూ కూర్చుంటే "మీరు అసలు ఎందుకు వచ్చారు ఇక్కడికి" అని అడిగేవారు. వెంకయ్య స్వామి వారి దర్శనానికి అని చెబితే "మరి వెళ్ళకుండా ఇక్కడే ఉన్నారే" అనే వారు. వెళ్లొచ్చామండీ పొద్దున అంటే "మరి ఎందుకు ఇంకా ఉన్నారు ఇక్కడ" అనే వారు. కాదండి మూడు రోజులు ఉందామని వచ్చామంటే "మరి మూడు రోజులు ఏమి చేద్దాం అనుకుంటున్నారు? అని అడిగి, ఫ్యాన్ వేసుకుని ఊరకనే పడుకుందాం అనుకుంటున్నారా?, మీరు అక్కడనే ఉండాలండి... స్వామి దగ్గరనే ఉండాలండి మీరు" అని చెప్పి గుడికి పంపించేవారు.

ఈ విధంగా శ్రీసార్ మన భవిష్యత్తు కోసం ఆలోచించి మనకు చెప్పిన వాటిల్లో కొన్నైనా మనం ఆచరించగలిగితే ఎంతో గొప్పగా ఆనందంగా ఉండగలము. అన్నీ ఆచరించడానికి కనీసం ప్రయత్నమైనా చేయాలి.

**గొలగమూడి వాస్తవ్యులు శ్రీ నారాయణ గారు** ఇలా శ్రీ సార్ తో గల అనుబంధాన్ని ఇలా వివరిస్తున్నారు.

"గురువుగారి గురించి చర్చించుకొనగలగడం కూడా ఒక పూర్వ జన్మ పుణ్యమేరా" అనేవారు శ్రీ సార్ కొన్ని సందర్భాలలో. శ్రీ సార్ కొన్ని విషయాలు చెబుతుంటే నేను మామూలుగా క్యాజువల్ గా తీసుకునే వాడిని. ఈయన చెబుతుంటారులే అని అనుకునేవాడిని. మొన్న 2017 ఆరాధన అయ్యాక నేను, వేణు సార్, వాళ్ళ పెద్ద సాయి మదర్ తెరీసా ఆశ్రమానికి వెళ్లి సరుకులు ఇచ్చేసి వెళ్ళవచ్చు, అని శ్రీ సార్ దగ్గరికి వెళ్లి వేణు సార్ కల్పాకం, నేను ఊరికి వెళ్తాను సార్ అని చెప్పాము. వేణు సార్ కి శ్రీ సార్ అభయమించి వెళ్ళమన్నారు. సార్ నేను కూడా సాయంత్రం వెళ్తాను సార్ అంటే శ్రీ సార్ "నీవు కూడా వెళ్తున్నావా" అన్నారు. సాయంత్రం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని వెళ్తాను సార్ అని చెప్పాను. శ్రీ సార్ రేపు వెళ్ళమన్నారు. నాకు బుర్ర పనిచేయలేదు. శ్రీ సార్ అలా అంటూనే ఉంటాడులే అని నెల్లూరు రైల్వే స్టేషన్ కి వెళ్లాను. జైపూర్ రైలు బండి ఎక్కేసాను కానీ అది ఒంగోలులో ఆగదు అని నాకు తెలియదు. ఈ విషయం TC వచ్చాక చెప్పాడు. ఒంగోలు దాటిన తర్వాత చీరాల దగ్గర సిగ్నల్ పడితే బండి ఆగింది. అక్కడ దిగి చాలా కష్టపడి తిరిగి ఒంగోలు చేరాను. చేరేసరికి తర్వాత రోజు ఉదయం 5:00 అయింది అలాకాక శ్రీ

సార్ చెప్పినట్టే తర్వాత రోజు వచ్చి ఉంటే ఇంచుమించు అదే టైంలో చేరేవాడిని.

2016 శ్రీ సార్ కు అందరం నమస్కారాలు చేసుకుంటుంటే నేను కూడా నమస్కారం చేసుకొని "వర్షాలు లేవు సార్ కొద్దిగా వర్షం పడనీయచ్చు" కదా అని అంటే "సరే పడతాయిలే" అన్నారు శ్రీ సార్. మా ఊరులో బాగా వర్షాలు పడ్డాయి. శ్రీ సార్ ఆజ్ఞ ప్రకృతి కి కూడా శిరోధార్యం.

ఆధ్యాత్మికతలో పైకి రావాలంటే భార్య సహకారం కావాలి. అమ్మగారు గురించి శ్రీ సార్ అమ్మగారు వలన ఇలా జరిగింది అనేవారు. విద్యానగర్ వెళ్లాలా అంటే శ్రీ సార్ చార్జీలకు కూడా అమ్మగారు డబ్బు ఇచ్చేవారు. అమ్మవారు మాత్రం చాలా తేలిగ్గా తీసుకునేవారు. శ్రీ సార్ యొక్క కోపం చాలా ఎక్కువగా ఉండేది. శ్రీ సార్ కు కోపమొస్తే వాళ్ళ భౌతిక శరీరాన్ని కూడా పరిగణలోకి తీసుకునేవారు కాదు. ఒకసారి 90లో గూడూరు నుండి తిరుపతికి పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ కి బస్సులో వెళ్తుంటే ఒక త్రాగినవాడు, శారీరక దారుఢ్యం ఉన్నవాడు గొడవ చేస్తే శ్రీ సార్ అతని మీదకు చాలా తీవ్రమైన స్వరంతో అతని అదుపు చేశారు. అతను కూడా ఏమీ అనకుండా చివరి సీట్లో పడుకొని తిరుపతిలో దిగిపోయాడు. అతని చేతిలో రాడ్ ఉన్నా

కూడా శ్రీ సార్ లెక్కచేయలేదు. కొన్ని విషయాలలో శ్రీ సార్ ధైర్య సాహసాలు అసమాన్యం!

శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమంలో ఒక అధికారి శ్రీ సార్ ను హారతి ఇచ్చి మాల తెమ్మన్నారు. కానీ శ్రీ సార్ ధైర్యం గా “ఇవ్వను” అని చెప్పేశారు. కొన్ని సందర్భాలలో మాత్రము శ్రీ సార్ కొన్నిసార్లు “అలవిగాని చోట అధికులమని అనరాదు” అనేవారు. వాడి పాపానికి వాడు పోతాడు అనేవారు. శ్రీ సార్ చెప్పినది చెప్పినట్లు చేస్తే ఆ బాధ్యత శ్రీ సార్ తీసుకుంటారు. దానికి ఒక ఉదాహరణ. 2007లో చీమకుర్తికి నేను ఉద్యోగం కోసం వెళ్తే శ్రీ సార్ “ఉద్యోగం వచ్చేంతవరకు రావద్దు” అని 15 పైసల పోస్ట్ కార్డు మీద వ్రాసి పంపారు. “తొందరపడి గొలగమూడికి రావద్దు, ఉద్యోగం దొరుకుతుంది లే!” అని అన్నారు. నేను శ్రీ గురు చరిత్ర పారాయణ చేస్తున్నాను. డబ్బులు తక్కువగా ఉండటం వలన ఎవరో భోజనం పెడితే గుడిలో తిన్నాను. గొలగమూడికి వెళ్తే శ్రీ సార్ తిడతాడు ఏమో అని అనుకుని అక్కడే అలా చేస్తుంటే నెక్స్ట్ డే నా ఫ్రెండ్ ద్వారా ఉద్యోగం వచ్చింది. జీతం కూడా అధికంగా ఇచ్చారు. శ్రీ సార్ “ఎంతో కొంత ఇస్తారు లే!” అని అన్నారు. నాకు 4000 ప్లస్ 1500 ఇచ్చారు. అంత డబ్బు వాళ్ళ ఇవ్వటం అదే ప్రథమం అని అక్కడవున్న వారు చెప్పారు. 2010 లో శ్రీ సార్ దగ్గర ఉంటే

మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలు అయింది. శ్రీ సార్ నా వైపు "చూచి నువ్వు వెళ్ళు భోజనానికి ఆ అమ్మాయి ఎదురు చూస్తుంటుంది" అన్నారు. నేను ఇంటికి వెళ్లి చూడగా అలాగే జరిగింది.

## శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

గొలగమూడి, 02-07-05

అమ్మా !

చిద్విలాసము అంటే నేను అనుకున్నది తప్పో రైటో నాకు వ్రాయండి. చిత్ యొక్క విలాసము, చిత్ అంటే అంతటా నుండి అన్న విశ్వ చైతన్యం. విలాసము అంటే క్రీడ, ఆట, విన్యాసము, వినోదార్థం చేయు పని. అన్ని జీవులను, అన్ని జడములను ఇలాంటి సన్నివేశాలలో ఇరికించి మనం లబలబా కొట్టుకుంటుంటే; ఒక్కొక్కసారి చిన్న బిడ్డల బుగ్గ గిల్లగానే ఏడుస్తుంది. ఆ బిడ్డ మనం లేదులే, లేదు, లేదులే అని బుజ్జగిస్తాము. అలాగే ఆ చిత్ మనలను ఏడిపిస్తూ అది ఆనందిస్తూ ఉంటుంది. మనం ఏడవకుండా ఉండడం నేర్చుకునే వరకు. నేర్చుకున్నప్పుడు ఇక మన జోలికి రాదు ఆ చిత్! పెద్దయ్యాక బుగ్గ గిల్లితే ఏడుస్తామా? చిరునవ్వుతో సరిపెడతాము. అలాగే మనం తత్వం తెలుసుకొని, అది ఆచరణకు వస్తే ఇక

మనకు బాధే ఉండదు. **భర్త రూపంలో, బిడ్డ రూపంలో, స్నేహితుల రూపంలోనూ అక్కచెల్లెళ్ల రూపంలోనూ, మనల్ని గిల్లేది ఆ చైతన్యమే! అనే మాట గుర్తుంటే ఇక బాధే ఉండదు. "త్వమేవ మాతాచ, పితా త్వమేవ" అనేది అదే కదా! దాని యొక్క క్రీడ, ఆట, వినోదమని గుర్తించి బాధపడకుండా ఉంటే ఆ చిత్ మనతో ఆటలాడడం మానేస్తుంది. గిల్లడం మానివేసి మరో రకం ఆట మొదలవుతుంది. ఈ సత్యం మరవడమే మాయ.** మన పైన ఆడే ఆట యొక్క ఫలితం. కనుక ఈ చిత్ యొక్క విలాసమును గురించి మీరు కూడా వ్రాయండి.

శ్రీ స్వామివారి ఆశీస్సులు, పెసల సుబ్బరామయ్య

------------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం --------------------------

OM

గొలగమూడి, 06-07-05

Dear Sai!

పూజ్య గురు బంధువులైన లక్ష్మక్క గారికి పెసల సుబ్బరామయ్య రాయడం. పె. సు. నమస్కారములు. మీరు శ్రీ ఏకనాథ స్వామి వారి చరిత్రలో ఈ విషయం గుర్తుపెట్టుకున్నారో లేదో మరలా వ్రాస్తున్నాను. హృదయగతం చేసుకోవడం నాకు కూడా మంచిదే. భగవద్ ఆదేశాన్ని అనుసరించి శ్రీ ఏకనాధుల వారు భాగవతాన్ని సంస్కృతం నుండి మరాఠీలోకి అనువాదం

చేస్తున్నారు. ఇది సంస్కృత పండితులందరికీ ఆగ్రహం కలిగిస్తుంది. శ్రీ ఏకనాధుల వారి కుమారుడు గొప్ప సంస్కృత పండితుడు. అలా భాషాంతరీకరించుటకు తన సొంత కుమారునికి కూడా ఇష్టం లేదు. ఎవరో గిట్టని వారు కాశీ లోని సంస్కృత పండితులకు ఫిర్యాదు చేస్తారు. ఆ పండితులకు పెద్ద ఉంటారు. వారి ఆజ్ఞ ప్రతి వారికి శిరోధర్యం కావాలి. అది అప్పటి కట్టుబాటు. తన సేవకుల ద్వారా శ్రీ ఏకనాధుల వారిని తన కోర్టుకు పిలిపిస్తారు. వచ్చేటప్పుడు భాషాంతరీకరించిన భాగవత ప్రతిని తెమ్మంటారు. అంతటి తప్పు చేసిన శ్రీ ఏకనాధుల వారి ముఖం చూడకూడదని ఇరువురికి మధ్య తెరగట్టి విచారణ చేస్తారు. నేను దైవాదేశం పైననే భాషాంతరీకరించానని, శ్రీ ఏకనాధుల వారు చెప్తారు. అదంతా అసత్యమని, ఆ మరాఠీ ప్రతిని గంగానది లో  పారవేయమని ఆజ్ఞాపిస్తారు. ఇక్కడ ఏకనాధుల వారి గొప్పతనం తెలుస్తుంది.

తుకారాం గారి అభంగాలు గంగలో పారవేస్తే వారు వారం రోజులు నది వద్దనే నిలబడి నిరాహారంగా ప్రార్ధన చేస్తారు. కానీ **శ్రీ ఏకనాధుల వారు ఏమీ చలించడు. అంతా మీ చిత్ విలాసము. నా చేత వ్రాయించావు. వారి ద్వారా పారవేయమని ఆజ్ఞాపించావు. అంతయు నీ ఇష్టమే నెరవేరుగాక, అని గంగలో మరాఠీ భాగవతాన్ని పారవేసి నదీమ తల్లికి నమస్కరించి వెను తిరిగి పోతారు.** తన తోటి ప్రజలంతా “జై జై గంగా మాత” అని నినాదాలు

చేస్తున్నారు. వాళ్ళందరికీ మరాఠీ భాగవత ప్రతులు నీటి నుండి బయటికి వచ్చి శ్రీ ఏకనాథ స్వామి చేతిలో పడడం మాత్రమే కనపడుతుంది. శ్రీ ఏకనాధుల వారికి గంగా నదీమ తల్లి కూడా కనిపిస్తుంది. ఇక్కడ మనం శ్రీ ఏకనాధులను చూసి ఎంతైనా నేర్చుకొని ఆచరించాలి. **అంతా మీ చిద్విలాసము. మీరు ఎలా ఆడమంటే అలాగే ఆడతాను. మీరే నన్ను ఆడిస్తారు. నాదేముంది! పాంచ భౌతికమైన శరీరం నాది కాదు. నీవే దాన్ని తయారుచేసి అందు క్రీడించుచున్నావు. అదే సర్వస్య శరణాగతి**. నరసీ మెహతా ఒకలాగు చేస్తే శ్రీ ఎకనాధుల వారు మరొక మెట్టు పై స్థాయిలో చేస్తున్నారు. ఆహా ఈ మహనీయమూర్తుల సర్వస్య శరణాగతి శ్రీ మాష్టారికే దక్కింది గాని నాలాంటి హీనులకి ఎన్ని జన్మలకైనా సాధ్యమా? మానావమానాలు లేవు!

పెసల సుబ్బరామయ్య

--------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం -------------------------

OM

గొలగమూడి, 12-07-05

Dear Sai!

నీ హైదరాబాద్ ప్రయాణం ఏమైంది? మాత్రలు ఎట్లా చేస్తున్నావు? అమ్మని ఇబ్బంది పెట్టకుండా చూడు. **ఆధ్యాత్మికత అంటే దేవునికి ప్రీతి కలిగించడం**

**కదా! ఈ విశ్వమంతా ఆయన రూపంగా దర్శించి అనుభవిస్తూ ప్రవర్తించడమే కదా! అమ్మ కూడా ఆయన రూపమే! "త్వమేవ మాతాచ, పితాత్వమేవ" అంటే అదే కదా! అమ్మకు ఇబ్బంది కలిగించేలా టెన్షన్ తెచ్చుకోవద్దు. ఆయన నడుపుతున్నాడు అనే భావన చెదరకుండా ఉంచుకో. అన్ని వారే సమకూరుస్తారు.** శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా నీకు ఉండాలని ప్రార్థిస్తూ

పెసల సుబ్బరామయ్య

---------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం-------------------------

OM

గొలగమూడి, 19-07-05

Dear Sai!

ఈ రోజు ఒకరితో రెండు గంటలు కాలం గడపవలసి వచ్చింది. ఏమీ వ్రాయలేకున్నాను. **"మైసూర్ మహారాజును చూస్తే ఏమొస్తుందయ్యా, ఎవరు చేసుకున్నది వారికే కదా!". సత్యం, ధర్మం సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ. కాళ్లు వత్తడం కాదు. విశ్వవిభుని నమ్మి వారు మనకు ఇచ్చిన పని టాప్ గా నిర్వహించడమే సద్గురు సేవ. ఇది నేను మాస్టారు నుండి నేర్చిన సత్యం.** శ్రీ స్వామి వారు ఆచరించి చూపారు. సాయి ఆచరించి చూపారు. అదే మనకు ఆచరణ యోగ్యం. శ్రీ స్వామివారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

---------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం --------------------------

OM

గొలగమూడి,

22-07-05

పూజ గురుబంధువులైన లక్ష్మక్క గారికి,

శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్ధన. చిరంజీవి సాయికి శ్రీ స్వామివారి సదా తోడుండి నడిపించాలని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య రాయడం. **మనలో ఆశావ్యామోహాలు ఉన్నాయని మనం గుర్తించడం ఎలాగండి? వాటిని ఆ దొంగలను పాల ద్రోడడం ఎట్లాగండి? అన్యధా భావించక శ్రీ మాస్టర్ గారు వ్రాసిన గ్రంథాల నుండి, వారి ఆచరణ నుండి మీకు తెలిసింది వ్రాయ ప్రార్ధన.**

డియర్ సాయి! నా సంగతి మరిచిపోకు! “ఎలిజిబిలిటీ” పరీక్షలో ఎస్ సాధించకుంటే నా సంగతి మరిచిపోయావు అనుకుంటాను. **వాచా శూరత్వం, పేనా శూరత్వం కాకుండా కార్య శూరత్వం చూపి నీకు శ్రీ స్వామివారి ఎడల గల విశ్వాసం చూపించు!** శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా మీకు ఉండాలని ప్రార్థిస్తూ

మీ పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

## మత్తహ స్మృతి ర్జ్ఞాన మపోహనంచ

అమ్మ! నెల్లూరులో ఒక చిన్న ఇల్లు ఉంది. అంటే అది నా concerned, ఆ ఇల్లు. మా అమ్మ తమ్ముడు నిన్న చెప్పానే (పెళ్లి చేసుకున్నాడు), మా చెల్లెలను ఇస్తే చచ్చిపోయిందని, ఇంకొకామెను చేసుకున్నాడని, వాళ్ళదన్నమాట ఆ ఇల్లు. ఇంతది ఆ ఇల్లు. ఇంత ఇల్లు ఉంటే మొదటి భార్యకి (మా చెల్లెలుకి) ఇద్దరు మొగ పిల్లకాయలు. రెండో భార్యకి ఒక మొగ పిల్లోడు. సరే అని చెప్పేసి ఇక ఇది వేగులాటలు బాగాలేదు, ఆమె సరిగా చూడదు వీళ్ళని అని, వీళ్లు ఇద్దరు పిల్లకాయలు కాబట్టి రెండు అంకణాలు ఇచ్చేసి ఒక అంకణంలో వాళ్లిద్దరు కొడుకు, వాళ్ళ అమ్మ ఉండాల! ఒక్కడే కదా కొడుకు అందుకని వాడికి ఒక అంకణం, వీళ్ళిద్దరు మొగ పిల్లగాళ్లు కాబట్టి రెండు అంకణాలు మొత్తం మూడు అంకణాలు ఇల్లు అనుకొని వీలునామా చేసేసి, కాయితం రాయిం చేసిన. అట్టే రిజిస్టర్ కూడా చేశాం. ఏ రోజు ఎట్లా ఉంటాదో? అని. సరే, ఈ రెండు అంకణాలని పోస్ట్ ఆఫీస్ కి బాడీకి ఇచ్చేసినాము. ఇప్పుడు ఈ అంకణంలోనే వీళ్ళు ఉంటున్నారు. కానీ వీళ్ళు ఉంటుంటే ఇక్కడ ఒక గోడ ఏంటంటే నేను పెట్టకుండా మట్టి గోడ ఎట్లా ఉన్నదో అట్లనే ఉండిచ్చేసా, ఇటుకులు మట్టితో పెట్టేసినారు. అదంత పెద్ద

కాస్ట్ అన్నమాట ఆ రోజుల్లో, డివైడ్ చేసేటప్పుడు ఆ గోడ కూడా తీసి పెట్టేయాలంటే గట్టిగా, అంటే ఫౌండేషన్స్ తవ్వాలా, ఫౌండేషన్ దగ్గర నుంచి కట్టుకొని రావాల, అది అంత కాస్ట్ మేము భరించలేక ఆఁ ఉంటే ఉంటుందిలే గోడ! ఊరికినే పైన బరువు లేకుండా, ఊరికనే అట్టా కట్టేసి చెక్కలు కూడా పెట్టేసిన. అంటే వాళ్ళకు కనపడకుండా ఉంటుందని. పోస్ట్ ఆఫీస్ కి ఇచ్చేసినాము. పోస్ట్ ఆఫీస్ వాళ్ళు గోల పెట్టారు, ఏఁ ఇట్లుంటే లాభం లేదు అట్లట్ట అని, అయ్యా మీరు లేసిపోండి మా వల్ల కాదు అది కట్టడం. ఇప్పుడు 10,000 కావాలి, నేను ఏడ నుంచి తీసుకొచ్చేది, మీకు పాపం అని ఇచ్చింది కాక. మాకు ఇది ఒకటి బెడదా? అని చెప్పినా. వారు ఎట్లనో సర్దుకున్నారు. ఆ! తీసేసారా ప్రోగ్రాం. సాగితే ఎన్నైనా చేస్తారు వాళ్ళు. సరేఁ బాడుగకి ఇస్తున్నాం, చేస్తున్నాం అమ్మ. ఇప్పుడు వీళ్ళ ఇంట్లో ఈ పక్కన ఉండారే ఒక ఒక్క అబ్బాయి, ఆ అబ్బాయికి ఒక చెల్లెలు ఉంది. ఆ చెల్లెలకి పెళ్లి చేయాల, చెల్లెలకి పెళ్లి చేయాలంటే ఈ చెక్కలు పెట్టి ఉండే చోట పైన ఉండేటువంటి ఆ ప్లేట్ మొత్తం ఇరిగి పడిపోయింది. అది ఉండలా సిమెంట్ వరకు. కాంక్రీట్ అట్టనే ఉంది. అది మాత్రం ఇరిగి పడిపోయింది. ఎందుకు అట్ట పడిపోయిందయ్యా అంటే దాని పైన ఏంటంటే వీళ్ళల్లో ఈ మొగపిల్లకాయల్లో ఒకడు పోయి కాపురం చేరి,

బాడుగిచ్చేసిన పోస్ట్ ఆఫీస్కి పైన, వాడి పోర్షన్ పైన, ఒక చిన్న రేకులిల్లేసుకొని ఆ కాపురం చేరాడు. వాడు తొట్టి పెట్టి నీళ్ళు పోయడంతో ఆ నీళ్ళ చెమ్మ దెబ్బకు ఏంటంటే, ఊరి పోయి. తొట్టి పెట్టి నీళ్ళు పోయొచ్చు, కానీ దానికి తగువైన పని చేయాలి. కింద, ఏదన్నా ప్లాస్టరింగ్ బాగా చేసి నీళ్ళు ఇనక్కండా చేయాల! అట్లా చేయలా వాడు. ఉన్నది కాబట్టి ఆ తొట్టి పెట్టేసినాడు, పోసేసినాడు. మేమూ గమనించలేదు. ఇది ఇట్టా జరగద్దని అనుకోలా, మాకు తెలిసి ఏడవలా! ఒకరోజు ఒకే తూరి మొత్తం పడిపోయింది. అది ఎట్టనో ఈ సీతమ్మ వాళ్ళు పక్కన ఉండారే వాళ్ళు మనుషులు ఎవరైనా ఉంటే వాళ్ళు నెత్తిన పడి ఉండును.

ఏదైనా అంగ వైకల్యం కూడా వచ్చి ఉండాల! అది ఎట్టనో పాపం ఎవ్వరూ లేనప్పుడు, భగవంతుడు చేసినట్టుగా టపక్కని కింద పడిపోయింది. సరేం ఇప్పుడు ఈ అమ్మాయికి పెళ్లి చేస్తుంటారు, గనుక మళ్లా ఏంటంటే దాన్ని శుభ్రం చేసి రిపేర్ చేసుకోవాలా. 10 మంది చుట్టాలు వస్తారు అని, మూడు సంవత్సరాలు కరస్పాండెన్స్ చేసినం, పోస్టాఫీసు వారితో అద్దె ఇల్లు కాళీ చేయమని. ఈ పోస్ట్ ఆఫీస్ వాళ్ళు ఒక బెంచ్ వేసున్నాడు పక్కన. ఈ బెంచ్ తీస్తే గాని మనం కట్టడానికి లే ఈ గోడ! గోడ కట్టుకోవాలంటే ఈ గోడ పడకొట్టాలి కదా! గోడ పడ కట్టాలంటే ఈ పోస్ట్ ఆఫీసోడుకి ఓపెన్

అయిపోతుండ్లా వీళ్ళు కూడా రావచ్చు ఇక్కడికి, దొంగలు రావచ్చు. అందువల్ల వీడు సామానంతా ఇవతల రూమ్ లోకి సర్దుకొని మాకు పర్మిషన్ ఇవ్వాలన్నమాట, ఈ గోడ కట్టుకునేదానికి! మూడు సంవత్సరాలు కరస్పాండెన్స్ చేస్తే ఒక్క గాడిద కొడుకు స్పందన కాడు, ఏమి స్పందనే లేదు! సరేనంటాడు అంటాడు అంతే! ఎందువల్ల? తమో గుణం! పెరిగిపోయి ఉంది, బుడ్లు తాగి, టీవీలు చూసి, పులి బంగరాలు తిని, ఇవతల బడి ఇట్టా. కాగితం రాసిచ్చి పెళ్లి అంటున్నాడే! ఒరేయ్ నీ అమ్మాబడవ! మనం పోయి వాడిని ఆ సూపరిండెంట్ ను అడిగి వాడు పర్మిషన్ ఇప్పిద్దామని ఈ పోస్టుమాస్టర్ కి లేదు. మేము కాయితం వాడికి రాస్తే (సూపరిండెంట్కి), వాడు ఇంకా దగుల్ బోతు నా కొడుకు! వీడు ఒక బాటిల్ తాగితే, వాడు ఐదు బాటిల్స్ తాగుతాడు. డబ్బులు ఉన్నాయిగా! వాడు అసలు అనుకోడు. ఏమిటి? బిజీ! అది మా కర్మ కూడా! వాడి ద్వారా అట్టా పని చేస్తుందది. చూసాడు, చూసాడు, చూసాడు వాడు వచ్చి నా దగ్గర కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు, ఎవరు? చెల్లెలు అన్న ఉండ్లా, ఏంది మామ! నేను ఇంటి నిండా ఇటుక రాళ్లు తెచ్చి పెట్టుకున్నాను, ఇసుక తెచ్చి పెట్టుకున్నాను, వాడు పర్మిషన్ ఇవ్వపోతే ఏం చేసేది? ఇది అయ్యేటట్టు లేదులే! ఆ పిల్లకి ఇప్పుడు పెళ్లి చేయలేము అన్నాడు. పెళ్లి చేయలేము అనే

తలికి నాకు చర్రున మండింది. మండించాడు! మనం చేసింది కాదు ఈ పాడు. రేఁయ్ నేను రాస్తా ఈ తడవ నేను. మనిషిని చూడు, నువ్వు తిరగాలిరా వాడు చుట్టూ, సూపరిండెంట్ చుట్టూ తిరగాల! తిరగందే వాడు ఈయడు పర్మిషన్, నేను రాసిన కాగితం ఎత్తుకొని పోయి సూపరిండెంట్ కియ్యి అని అన్నా. బాగా వినండి ఇక్కడ. అప్పటివరకు నాకు ఆ ఐడియా లేదమ్మా నేను ఇకను రాయబోయే దాన్ని నాకు ఐడియా లేదు. సూపరిండెంట్ కి రాయాలనే నేను వాడితో అన్నది.


## మహాత్ముల వాక్యాలు

శ్రీ భరద్వాజ మాస్టారు రచించిన "శ్రీ సాయి లీలామృతం" నుండి :

శ్రీ సాయి వంటి సద్గురువు పై భక్తిశ్రద్ధలు కలగడం ఎంతో అదృష్టం. కాని అటుపైన పాడుగునా మనకు ఆయన తోడుగా వుండి సరియైన మార్గంలో నడిపించాలంటే ఏం చేయాలి? **"నాపై నీ దృష్టి నిలుపు. నీపై నా దృష్టి నిలుపుతాను"** అన్నారు సాయి. ఆయన గురించి అనన్యంగా చింతన చేసిన వారి యోగక్షేమమే ఆయన వహిస్తారు. ఇదే శ్రీకృష్ణుడు, రమణ మహర్షి చెప్పిన శరణాగతి. **ఇది అంత సులభంగా, ఒక్కసారిగా కుదరదు. అనుకున్నవి నెరవేరినప్పుడు మన విశ్వాసం పొంగుతూ, లేనప్పుడు క్రుంగుతూ వుంటుంది. సద్గురువు సాంగత్యము, సేవవల్ల మాత్రమే స్థిరమైన**









**శరణాగతి క్రమంగా కుదురుతుంది. ఈలోగా అన్యచింతలు, శంకలు కల్గి, మనస్సు ఆయన నిజస్థితి మరచి చంచలమవుతూ వుంటుంది. అతి పరిచయం వలన శ్రద్ధ మందగిస్తూ వుంటుంది. ఇలాంటి ఒడుదుడుకులు లేనప్పుడే మనకు ఆయన సన్నిధి లభించినట్లు. అప్పుడే మనకు ఆయన నుండి సంపూర్ణమైన రక్షణ లభిస్తుంది.**

ఇలాంటి ఒడుదుడుకులకు గల కారణాలలో సాటివారి పట్ల మనకుండే భావము, వారి స్వభావాలలో గూడ వుంటాయి, అంటే సాటివారిలోని, మనలోని బలహీనతలే ప్రధాన కారణాలు. సాంగత్యానికి మనపై మనమూహించలేనంతటి ప్రభావముంటుంది. సాటివారి దృష్టి గూడ సంస్కరించబడుతుంటే మన యత్నం సులభమౌతూ వుంటుంది. అందుకే మనిషికి తన సాధనతోపాటు సత్సాంగత్యము గూడ అవసరమే. **ఈ సత్సంగమన్నది యీ కాలంలో సహజంగా దొరికేది గాదు. దానిని తోటలాగా పెంచుకోవలసిందే. మళ్ళీ మళ్ళీ కలుపు తీసుకుంటూ, నీరుపోస్తూ కాపాడుకోవలసిందే. ఇదే సత్సంగమంటే, ఇందుకోసం అందరమూ కలసి భగవంతుడైన సద్గురుని లీలలు, బోధలు, శ్రవణము, చింతనా చేస్తూ వుండాలి.** ఇలాంటివి వినడం ద్వారా మన హృదయాలను, సాటివారిని పరిశుద్ధం చేసుకొంటుంటే నిర్దుష్టమైన భక్తిశ్రద్ధలు తెగుళ్ళు లేకుండా పెరుగుతాయి.

**-------- సద్గురు దేవా శరణం శరణం ---------**



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**